క్లుప్తంగా

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



సాయి సేవకురాలు సూరీడమ్మను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున కాకడ ఆరతి అనంతరం బాబాకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి, ఆలయ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న సూరీడమ్మను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ధర్మాల వ్యాసశర్మ, గుదే శంభుడు మాట్లాడుతూ సూరీడమ్మ సేవలను ప్రశంసించారు. సూరీడమ్మ సహకారంతో పేదలకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస రాజు, సత్య, మురళీకృష్ణ, అన్నపూర్ణ, పీఎల్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్మికుల అర్హతలపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిసరాల విభాగం పరిధిలోని హార్టికల్చర్ సొసైటీల్లో పనిచేసే కార్మికుల అర్హతలపై సొసైటీ సభ్యురాలు దేవర అప్పలకొండమ్మ జిల్లా సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సొసైటీ విధి విధానాలు, పాలనాపరమైన అంశాలు, సభ్యుల గరిష్ట వయో పరిమితి, ప్రస్తుతం పనిచేస్తున్న సభ్యుల వయసు, పుట్టిన తేదీలు, పనిచేస్తున్న నిర్వాసితులు, నిర్వాసేతరుల వివరాలు కావాలని సొసైటీని సమాచార హక్కు చట్టం ద్వారా కోరామని, వివరాలు ఇవ్వకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



సంజీవరావు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ మెయిన్ గేటు ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన పి.సంజీవరావు (39) బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్నాడు. ఈ నెల 12న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, మెయిన్ గేటు బయట ఉన్న పైలాన్ వద్దకు వచ్చేసరికి ఏపీ 33 సీ 1683 కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సంజీవరావును నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆయన మృతి చెందారు. కారు నడిపిన వ్యక్తి కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

28న 100వ తపాలా డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 100వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆర్ఎంఎస్–వీ డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 100వ డాక్/ పెన్షన్స్ అదాలత్‌గా దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 21వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 28వ తేదీ జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అధికారులు అందజేశారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



లంకెలపాలెం హైస్కూల్లో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు



పెదముషిడివాడ హైస్కూల్లో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

- పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని లంకెలపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రౌతు నాగేశ్వరరావు అన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మిషన్ లైఫ్–ఎకో క్లబ్స్, పర్యావరణ పరిరక్షణ, అవగాహన కార్యక్రమాల్లో భాగంగా లంకెలపాలెం పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తా చెదారం, పనికిరాని వస్తువులను తొలగించారు. ఆవరణలోని పిచ్చిమొక్కలను ఏరివేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, లక్ష్మి, శ్రీను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యర్థాలపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ నినాదాలు చేశారు. ప్రకృతిని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పెద్దినాయుడు, సుధాకర్, సాయి లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశుడు



మేధినీ పూజలు చేస్తున్న రుత్వికులు



అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దివ్యక్షేత్రంలో సాయంత్రం అంకురార్పణ, మేధిని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వేకువజామున సుప్రభాతం, తోమాల సేవ నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా దివ్యక్షేత్రంతో పాటు పరిసర ప్రాంతాలు విద్యుత్ కాంతులు విరజిమ్మాయి. ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

సమాజ ప్రగతికి శాస్త్ర విద్య దోహదం

ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధనను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్.రాధాకృష్ణ, పి.రవి ప్రసాద్, ఎంవి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో పెయింటర్‌గా పనిచేస్తున్న కొల్లి వెంకటరమణా రెడ్డి మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబానికి వేమన సంఘం ప్రతినిధులు, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించిన వారు రూ.25 వేలు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వేమన సంఘం సభ్యులు దూడ పాపారావు, కాకి అప్పల రెడ్డి, నీలాపు అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: విద్యార్థులకు గుణాత్మక, నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను సద్వినియోగపర్చుకోవాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచించారు .79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను శుక్రవారం ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పుస్తకాలు, కిట్లు సద్వినియోగం చేసుకుని, విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో రికార్డులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రమణ, రాజశేఖర్, లక్ష్మీరాణి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లుకున్న ముళ్లపొదలు



రోడ్డు పైకి వచ్చేసిన ముళ్లపొదలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, జగ్గరాజుపేట, ఎస్టీబీఎల్, నరవ, షీలానగర్ రహదారులకు అనుసంధానంగా ఉన్న మార్గంలో ముళ్లపొదలు రోడ్డుపైకి వచ్చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలు కష్టంగా మారాయి. సిటీ నుంచి షీలానగర్ మీదుగా ఈ మార్గంలో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు.. గాజువాక, సబ్బవరం శివారు గ్రామాలకు సమీప మార్గం కావడంతో వాహనచోదకులు ఈ మార్గాన్నే ఎంచుకుంటున్నారు. అయితే రోడ్డుకిరువైపులా ముళ్ల పొదలు దట్టంగా అల్లుకోవడంతో పాటు రహదారి గోతులమయంగా మారడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రయితే జీవీఎంసీ, రైల్వే అధికారులు స్పందించాలని, నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే మార్గంలో ముళ్ల పొదలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. రహదారి విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దేవీపురంలో శ్రీవిద్య ప్రారంభిక కోర్సు ప్రారంభం



శ్రీవిద్య కోర్సు నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీవిద్య ప్రారంభిక కోర్సును శక్రవారం ప్రారంభించారు.తెలుగు భాషా మాధ్యమంగా ఈ నెల 14 నుంచి 17 వరకూ నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఈ కోర్సును గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. చెన్నై,కోయంబత్తూర్,ఆగ్రా,కోల్‌కతా, బెంగళూర్,రాయపూర్, ఢిల్లీతో పాటు యూరప్‌లోని లాత్వియా నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు ముందుగా గురు పాదుకా మంత్రోపదేశం చేసి కోర్సును ప్రారంభించారు. శ్రీగణపతి,బాల, చండీ మంత్రోపదేశాలు చేశారు. నాలుగు రోజుల్లో వీరు మంత్ర సాధన,యంత్రపూజ,తర్పణాల థియరీతో పాటు ఆచరణపూర్వకంగా ఉపాసనా విధానాలను నేర్చుకుంటారన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ తమ అనుగ్రహ భాష్యంలో అనేక మంది ప్రాంతీయతతో సంబంధం లేకుండా అమ్మవారి ఉపాసన నేర్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కందర్ప ప్రభాకర్‌తో పాటు ఆచార్యులు మూర్తి రాధ,కందర్ప రమ,వి.షణ్ముఖేశ్వరన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగం చేసైనా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుందామని సీఐటీయూ జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.రాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 1141వ రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. అటువంటి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కేంద్రంతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, ఎర్రిబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గొంతెత్తాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా రాష్ట్ర ఎంపీలు పార్లమెంట్‌లో గొంతెత్తాలని ఉక్కు పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ కోరారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల మొదటి రోజున వ్యతిరేక తీర్మానం చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1219వ రోజు శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం అనుసరించిన వైఖరి ఇప్పటి వరకు ఒక ఎత్తు కాగా, సంకీర్ణ ప్రభుత్వంలో మరో వైఖరి అవలంబించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఎంపీలంతా పట్టుబడితే సత్ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, హరినాథ్, పి.వి.రమణ, దానయ్య, సంతోష్‌కుమార్, దాసుబాబు, వెంకటమ్మ మాట్లాడారు. దీక్ష శిబిరంలో ట్రాఫిక్ విభాగం, ఆర్ఎండీ, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం



రక్తదానం చేసిన వారికి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ సుధాకర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోసం రక్తదానం చేయడం అభినందనీయమని ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుధాకర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో శుక్రవారం 7వ సారి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రక్తం ఇవ్వడానికి గత ఏడేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా 10 మంది రోగులకు అవసరమైన చికిత్స జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ హనీఫ్, ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ సారంగి, వార్డు కార్పొరేటర్ గంగారావు శిబిరాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, లైఫ్‌షేర్ బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో 300 యూనిట్లు సేకరించారు. కార్యక్రమంలో స్టీల్ సిటూ నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో అక్కిరెడ్డిపాలెం విద్యార్థుల ప్రతిభ



పీడీ ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న శాప్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన జూనియర్, సీనియర్ జట్లతో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి విన్నర్స్‌గా, రన్నర్స్‌గా నిలిచారని పాఠశాల పీడీ ఇస్మాయిల్ తెలిపారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 15 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. అనంతరం పాఠశాలలో ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. సమ్మర్ కోచింగ్ క్యాంపును విజయవంతంగా నిర్వహించిన అక్కిరెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల పీడీ ఇస్మాయిల్‌ను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి జూన్ గాలియట్ సన్మానించారు. కార్యక్రమంలో కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లు, పలువురు స్పోర్ట్స్ అధికారులు, పలు పాఠశాలల చెందిన పీడీలు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు



తోకాడలోని ఒక ప్రాంతంలో రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 72వ వార్డు తోకాడలో మురుగు రోడ్డుపైనే నిలిచిపోతోంది. పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో డ్రైనేజీలకు అవుట్ లెట్లు లేక మురుగు నీరు రోడ్డుపై వచ్చి చేరుతోంది. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న నివాసితులు దుర్గంధం, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. పైగా ఈ ప్రాంతంలో రోడ్డుపైనే డెబ్రిస్ డంప్ చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి, వాహనాల రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతం ఆటోనగర్‌ను ఆనుకుని ఉండటంతో పరిశ్రమలకు వెళ్లే వందలాది మంది ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. దీంతో మురుగు, ఇరుకు మార్గంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని, మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

సెయిల్‌లో విలీనానికి వినతి



ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేందుకు సహకరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు ప్రజా ప్రతినిధులను కోరారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన విశాఖ ఎంపీ భరత్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్‌లను కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్లాంట్‌కు తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 వేల కోట్లను ప్రిఫరెన్షియల్ షేర్లుగా అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న గనులు రెన్యువల్ చేయాలని, విద్యుత్ బకాయిలు చెల్లించడానికి గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సరఫరా 150 మెగావాట్లకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు, అమరావతి నిర్మాణానికి విశాఖ ఉక్కు వినియోగించాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్, సీహెచ్.వెంకటేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. గొయ్యి పూడ్చారు

- ట్రాఫిక్ పోలీసుల చొరవతో ప్రమాదాలకు చెక్



రోడ్డు మధ్య గోతిని దగ్గరుండి పూడ్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర సిగ్నల్ పాయింట్ వద్ద రోడ్డు మధ్య ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని పూడ్చేందుకు ట్రాఫిక్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇక్కడ ఎంతోమంది ప్రమాదాలకు గురై గాయాల పాలవడంతో గాజువాక సీఐ కోటేశ్వరరావు చర్యలు ఆదేశించారు. దీంతో రెడీ మిక్స్ కాంక్రీట్ మెటీరియల్‌తో గోతిని పూడ్పించారు. ఈ సందర్భంగా గాజువాక ట్రాఫిక్ సిబ్బంది మాట్లాడుతూ ఈ గొయ్యి కారణంగా ఇప్పటికే సుమారు 5గురు గాయపడ్డారన్నారు. గురువారం కూడా ఇదే ప్రాంతంలో ఒక వ్యక్తి వాహనంతో పాటు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలై, ప్రస్తుతం షీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. దీంతో సీఐ స్పందించి, సిబ్బంది సహకారంతో పనులు పూర్తి చేయించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్న ట్రాఫిక్ పోలీసులను స్థానికులు ప్రశంసిస్తున్నారు.